## సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



మేడారం సమ్మక్క, సారలమ్మను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శనివారం దర్శించుకున్నారు. అనంతరం తులాభారంలో పాల్గొని బంగారం సమర్పించారు. – కూకట్‌పల్లి

## విజయ్‌సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి



యాత్ర వివరాలను తెలియజేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యరావు

**కూకట్‌పల్లి:** భాగ్యలక్ష్మీ క్లస్టర్ విజయ సంకల్ప యాత్ర కూకట్‌పల్లికి ఆదివారం సాయంత్రం 4గంటలకు చేరుకుంటున్న సందర్భంగా నియోజకవర్గంలోని బీజేపీ కుటుంబ సభ్యులతో పాటు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున విజయ సంకల్ప యాత్రలో పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్సనపల్లి సూర్యరావు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు వివేకానందనగర్ డివిజన్ హనుమాన్ ఆలయం వద్దకు బస్సు యాత్ర చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి కూకట్‌పల్లి రామాలయం మీదుగా బీజేపీ కార్యాలయం, కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్‌స్టాప్, రమ్యాగ్రౌండ్స్, ఫోర్త్ ఫేజ్ మీదుగా కై త్లాపూర్ నుంచి మూసాపేటలోని చిత్తారమ్మ ఆలయం వద్దకు రాత్రి 8 గంటలకు చేరకుంటుందన్నారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరు ఈ విజయ సంకల్ప యాత్రలో పాల్గొని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థిని బలపర్చి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎటువంటి అవినీతి మచ్చ లేకుండా 10 సంవత్సరాలుగా నిస్వార్థంగా దేశం కోసం పనిచేసిన నరేంద్ర మోడీ సర్కార్‌ను మరోసారి గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రజా సంకల్ప, విజయ సంకల్ప యాత్రలు, బహిరంగ సభలను అందరూ విజయవంతం చేయాలని కోరారు.

## వైభవంగా ఆలయాల వార్షికోత్సవం




సంజీవ ఆంజనేయస్వామి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

**ఆల్విన్‌కాలనీ:** పాపారాయుడునగర్‌లోని శ్రీ సంజీవ ఆంజనేయస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా కమిటీ ఆహ్వానం మేరు పాపిరెడ్డినగర్ కంటెస్టెంట్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మొదటి వార్షికోత్సవ వేడుకల్లో సిహెచ్. నరసింగరావు, దొంతిరి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో దొంతిరి వెంకట్రావు, భాస్కర్‌రావు, మాదారం దేవేంద్రరావు, తిరుపతిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**పాపారాయుడు నగర్‌లో..**

**ఆల్విన్‌కాలనీ:** కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపారాయుడు నగర్‌లోని సంజీవ ఆంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే గాంధీని శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్, పోతుల రాజేందర్, కాశీనాథ్‌యాదవ్, నర్సింగరావు, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రావు, భాస్కర్‌రావు, దేవేందర్‌రావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

# వసతులు బ్రహ్మాండం



కీసరగుట్ట ఆలయ పరిసరాలు

### మహాశివరాత్రి ఉత్సవాలకు కీసరగుట్ట ముస్తాబు
### మార్చి 6వ తేదీ నుంచి 11 వరకు జాతర



క్యూలైన్లు ఏర్పాటు చేసిన దృశ్యం

**కీసర:** వచ్చే నెల 6వ తేదీ నుంచి 11 వరకు జరుగనున్న కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. గుట్టకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈసారి జాతరకు లక్షల మంది భక్తులు వస్తారన్న అంచనాతో అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ గౌతమ్ ఒకసారి జిల్లా యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించడంతో పాటు ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈక్రమంలో మరోసారి కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లకు సంబంధించి రెండోసారి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ నాగలింగం తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి లడ్డూ ప్రసాదం తయారీ చేపట్టనున్నారు.

**పనులు పరిశీలించిన ఆర్డీఓ**

**కీసర:** బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఇక్కడ జరుగుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్, వాహనాల పార్కింగ్, రోడ్డు విస్తరణ పనులపై పలు సూచనలు చేశారు. సామాన్య భక్తులతో పాటు వీవీపీ దర్శనాలకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఆయన వెంట కుషాయిగూడ ఏసీపీ నరేశ్‌రెడ్డి, కీసర సీఐ వెంకటయ్య, ఆలయ చైర్మన్ నాగలింగం, ఈఓ నరేందర్, ట్రస్టు బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### భక్తులకు ఇబ్బందులు కలుగకుండా..



సామాన్య భక్తులకు దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏరాట్లు చేస్తున్నాం. గర్భాలయంలో కొలువైన స్వామివారిని ఒకేసారి నలుగురు దర్శించుకునేలా క్యూలైన్ల నిర్మిస్తున్నాం. వీవీఐపీలకు ప్రత్యేక క్యూలైన్ ఉంటుంది. శీఘ్ర దర్శనం, అభిషేకం టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతాం. ఈసారి ప్రసాదాల కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– తటాకం నాగలింగం, ఆలయ చైర్మన్



ప్రధాన ఆలయానికి పంచ రంగులు వేస్తున్న దృశ్యం



కీసరగుట్ట జారత జరిగే ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ట్రాక్టర్‌తో చదును చేస్తున్న దృశ్యాలు

### పనులు ఇలా..

1. గుట్ట పరిసర ప్రాంతాలతో పాటు ప్రధాన ఆలయం, రాజగోపురాలు, ఆంజనేయ స్వామి విగ్రహానికి, మహామండపానికి రంగులు వేసే కార్యక్రమం.
2. మరోవైపు హుడా పార్కు నుంచి ఉత్తర ద్వారం గుండా స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లు, భక్తులు సేద తీరేందుకు ఆంజనేయ స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో చలువ పందిళ్ల నిర్మాణం.
3. కమాన్ నుంచి గుట్ట వరకు ఆర్ అండ్ బీ రహదారి విస్తరణ పనులు.
4. విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనులు
5. కీసరగుట్ట దేవస్థానం చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ నరేందర్‌ల ఆధ్వర్యంలో కీసర నుంచి గుట్ట ప్రధాన ఆలయం వరకు సైన్‌బోర్డుల ఏర్పాటు. 6. ఆర్‌డబ్ల్యూఎస్, ఎగ్జిబిషన్ గ్రౌండ్ చదునుతో పాటు మరుగుదొడ్ల ఏర్పాటు, పార్కింగ్ ప్రాంతాల ఏర్పాటు.

### నేడు 'స్వచ్ఛమైన జలం - స్వచ్ఛమైన మనసు'

**కూకట్‌పల్లి:** బాబా హరదేవ్‌సింగ్ జీ మహరాజ్ వారి దివ్య సందేశ ప్రేరణతో సంత్‌నిరంకారి చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రాజెక్ట్ అమృత్ కార్యక్రమంలో భాగంగా 'స్వచ్ఛమైన జలం - స్వచ్ఛమైన మనసు'అనే నినాదంతో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి రంగధాముని చెరువు ఐడీఎల్ ప్రాంతాన్ని శుభ్రపరిచే సేవా కార్యక్రమంలో పాల్గొనున్నట్లు తెలిపారు. ప్రకృతి ప్రేమికులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతాన్ని చేయాలని కోరారు.

### 26న ఫొటోగ్రఫీపై వర్క్‌షాప్

**రాయదుర్గం:** మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన ఫొటోగ్రఫీ వర్క్‌షాప్, ఫిల్మ్ స్క్రీనింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ శనివారం తెలిపారు. సమాచారం కోసం ఐఎంసీ నిర్మాత, కార్యక్రమం కన్వీనర్ ఎండీ అమీర్ (8744 994437)లో సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే



**మోతీనగర్:** మూసాపేట డివిజన్ పరధిలోని బడ్స్ ఇన్ బ్లూమ్స్ పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ శశిభూషణ్ మాట్లాడుతూ.. గతంలో బాల్యదశలో చిన్నారులకు వారి అమ్మమ్మలు, తాతయ్యలు దగ్గర ఉంటూ ఎన్నో మంచి విషయాలు, పురాణ, దేవత కథలు వివరించే వారని అన్నారు. ఈ విధంగా చిన్నారులు చిన్నతనంలోనే అనేక విషయాలు తెలుసుకునే వారన్నారు. నేడు అనేక మంది చిన్నారుల అమ్మమ్మలు, తాతయ్యలు అందుబాటులో లేక పోవటంతో వారి ప్రేమకు, వారు చెప్పే కథలకు దూరం అవుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు ఎంత బిజీగా ఉన్నా తమ తమ పిల్లలను అమ్మమ్మ, తాతయ్యల దగ్గర ఉండే విధంగా సమయం కేటాయించాలని సూచించారు. వారు మంచి విషయాలు నేర్పితే చిన్నారుల జీవితంలో ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతి ప్రియ, తదితరులు పాల్గొన్నారు.



దీపాదాస్ మున్షీ, బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

### కాంగ్రెస్‌లో చేరికలు

**మూసాపేట:** కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేటకి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మూసాపేట మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు, కర్క పెంటయ్య, మాజీ కౌన్సిలర్ తూము ఎల్లారావు, ట్రేడ్ యూనియన్ నాయకులు కర్క నాగరాజులు శనివారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీగుప్త, కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్‌ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, సూరజ్ తివారి, సాదు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిబాబు, రాజిరెడ్డి, పాండు ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, ఎం. సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త

● పరిసరాలు దుర్గంధమయం ● అవగాహన కల్పించినా ఫలితమేదీ..?





కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో రోడ్డుపై చెత్తా చెదారం, చెత్త వేయవద్దని హెచ్చరిస్తూ జీహెచ్‌యంసీ ఫ్లెక్సీ

**ఆల్విన్‌కాలనీ:** కూకట్‌పల్లి సర్కిల్ వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్‌ల పరిధిలో వీధుల వెంట చెత్త పేరుకుపోవడంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. జీహెచ్‌యంసీ సర్కిల్ పరిధిలో డస్ట్‌బిన్‌లను తొలగించి కాలనీల్లోని ఇళ్ల ముందుకు వచ్చే జీహెచ్‌యంసి వాహనంలో చెత్తను వేరు చేసి తడి, పొడి చెత్తగా అందించాలని చెప్పినా స్థానికులు ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం వేస్తున్నారని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు. జీహెచ్‌యంసీ అధికారులు ఆయా కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. చెత్తను రోడ్డుపై వేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా ఫలితం కనిపించటం లేదు. కాగా ఇళ్ల ముందుకు వచ్చే చెత్త సేకరించే వారికి నెల నెలా 100 రూపాయలు చెల్లించటం ఎందుకనే భావనలో స్థానికులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ రోడ్ల వెంట, నాలాల వెంట, నాలుగు కూడళ్ల వద్ద పడవేస్తున్నారు. కొందరు ద్విచక్ర వాహనాలపై వెళుతూ చెత్త సంచులను పడేసి వెళ్లిపోతున్నారు. చెత్త సేకరణకు డబ్బు తీసుకోకుండా ఉంటే పరిసరాలు శుభ్రంగా మారతాయని స్థానిక సంక్షేమ సంఘం సభ్యులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు ఈ దిశగా ఆలోచించాలని వారు కోరుతున్నారు.





## ఫుట్‌పాత్ ఆక్రమణలను సహించేది లేదు

**జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్**

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ శనివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూకట్‌పల్లి జోనల్ పరిధిలోని పార్కుల్లో లైట్లు, బెంచీలు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. రాత్రిపూట తనిఖీలు నిర్వహించి వీధి దీపాలు లేని ప్రాంతాల్లో లైట్లను ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్ సిబ్బందిని ఆదేశించారు.

◆ ప్రజా ఫిర్యాదుల నివేదికలు 24 నుంచి 48 గంటలలోపు చర్యలు తీసుకొని ఫిర్యాదుదారుల సమస్యను పరిష్కరించాలన్నారు. జవాన్‌లు అందరూ ఉదయం 6గంటలకు మైదానంలో ఉండాలన్నారు. వారిపై అధికారులు పర్యవేక్షించి హాజరు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి అనుమతి లేకుండా హాజరు కానీ జవాన్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

◆ రాబోయే రంజాన్ దృష్ట్యా మసీదులు, శ్మశానవాటికల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలపై సహించేది లేదని, ఇప్పటికే అనేక ఆక్రమణలు తొలగించామనన్నారు. రోడ్డును ఆక్రమించే ఆక్రమణదారులు వెంటనే తొలగించాలని సూచించారు. భవన నిర్మాణ అనుమతులు ముందుగా తీసుకోవాలని సూచించారు. కూల్చివేత వ్యర్థాలను ఇంజినీరింగ్ విభాగానికి చెందిన కాంట్రాక్టర్లు వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు డీసీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



డీసీలు, అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న జెడ్‌సీ అభిలాష అభినవ్

### హరిహరక్షేత్రంలో ప్రత్యేక పూజలు



ద్వాదశ జ్యోతిర్లింగ పూజలో పాల్గొన్న శివస్వాములు



**మూసాపేట:** భరత్‌నగర్‌కాలనీలోని హరిహరక్షేత్రంలో శనివారం శివస్వాములు ద్వాదశ జ్యోతిర్లింగ పూజ నిర్వహించారు. ఉదయం నుంచి శివ పార్వతులకు ప్రత్యేక పూజలు అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. శివయ్య మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ మాలధారులు ఆంజనేయులు, నరసింహ, రమేష్, వేణుగోపాల్, వీరేందర్ పాల్గొన్నారు.

### శ్రీగణేష్‌నగర్ అధ్యక్ష ఎన్నికల్లో త్రిముఖ పోటీ

**మోతీనగర్:** అల్లాపూర్ డివిజన్ శ్రీగణేష్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పన్నాల శేఖర్ రెడ్డి గత ఎనిమిది సంవత్సరాలుగా సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా ఉంటూ శ్రీగణేష్ నగర్ అభివృద్ధి లక్ష్యంగా పనిచేశారు. అదేవిధంగా మరో ఇద్దరు అభ్యర్థులు గోపాల్‌సింగ్, ప్రసాద్‌గౌడ్‌లో పోటీలో ఉన్నారు. తమకు ఒకసారి అవకాశం కల్పిస్తే ప్రజా సేవ చేస్తామని పేర్కొంటున్నారు. త్రిముఖ పోటీల్లో ఎవరు విజయం సాధిస్తారో ఆదివారం తేలనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా శ్రీగణేష్‌నగర్‌లో త్రిముఖ పోటీతో ఎన్నికలు కొనసాగటం మొదటిసారి అని స్థానికులు పేర్కొంటున్నారు.

### వరదనీటి కాలువ పనులు షురూ



దిల్‌ఖుష్‌నగర్‌లో పనులను పరిశీలిస్తున్న బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

**బాలానగర్:** బాలానగర్ డివిజన్‌లో ఎన్నో సంవత్సరాల వరద ముంపు సమస్యకు వరద నీటి కాలువ నిర్మాణం ద్వారా శాశ్వత పరిష్కారం లభించనున్నట్లు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి దిల్‌ఖుష్‌నగర్‌లో నూతనంగా చేపట్టిన నాలా అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీల్లో చేపట్టిన అభివృద్ధి పనులతో వాటి రూపురేఖలు మారిపోయాయన్నారు. తమ బస్తీల్లో ఇంత గొప్పగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. డ్రెయిన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ మోసిన్, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ జమీల్, డీఈ కేపీ బాలకిషన్, ఏఈ మొహమ్మద్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణ సంఘ మహిళా కార్యవర్గ సమావేశం



నిజాంపేట సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సంఘం మహిళా కార్యవర్గ సభ్యులు

**భాగ్యనగర్‌కాలనీ:** నిజాంపేట కామాక్షి బ్రాహ్మణ సంఘ మహిళా కార్యవర్గ సమావేశం శనివారం నిజాంపేట రోడ్డులోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ.. మార్చి 3వ తేదీన సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు మహిళలుపెద్ద ఎత్తున హాజరై దిగ్విజయం చేయాలని కోరారు. సామాజిక సేవలను విస్తృతంగా నిర్వహిస్తున్న పీఎస్ఎస్‌వీ ప్రసాద్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీలో ఉంటున్నందున సంఘం తరపున సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిదులు శంకర్ శర్మ, నర్సింహరావు, మహిళా విభాగం కార్యదర్శి భువనేశ్వరి, కళ్యాణి, జయశ్రీ, కుమారి తెన్నేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా రవిదాస్ మహరాజ్ జయంతి



**మూసాపేట:** మూసాపేట జనతానగర్‌లో మోచీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రవిదాస్ మహరాజ్ జయంతి వేడుకల్లో మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ శనివారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తుకారాం, విష్ణు, నరేష్, కొండిబా, రాహుల్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### 'యూనిక్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్' సర్టిఫికెట్ కోర్సు

**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ–ఫెర్నాండెజ్ ఫౌండేషన్‌లు కొత్తగా 'యూనిక్ కేర్ ప్రాక్టీషనర్ (బర్త్ డౌలా) సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించాలని నిర్ణయించారు. దరఖాస్తులు సమర్పించడానికి ఈనెల 29 తేదీ ఆఖరుగా నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా ఈ సర్టిఫికెట్ కోర్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ డిజిటల్ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ రిసోర్సెస్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఈ కోర్సును అందిస్తారు. ఈ కోర్సులో భాగంగా గర్భం, జననం, తక్షణ ప్రసవానంతర సమయానికి సంబంధిత కుటుంబాలను ఆదుకోవడంలో నైపుణ్యాలు, విజ్ఞానాన్ని అందించేందుకు ఈ కోర్సు తోడ్పతుంది. ప్లస్ టూ ఉత్తీర్ణత, ఆంగ్లంలో కమ్యూనికేషన్ నైపుణ్యం ఉన్న అభ్యర్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 73373 20910లో సంప్రదించాలని కోరారు.